క్లుప్తంగా

మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన మధుమతిరెడ్డి



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మధుమతిరెడ్డి

హిందూపురం: కుప్పంలో పర్యటనలో ఉన్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని సోమవారం హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి, నాగభూషణ్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హిందూపురం నియోజకవర్గ రాజకీయ పరిస్థితుల గురించి చర్చించారు.

ఎమ్మెల్యేను కలసిన ఈడిగలు



ఎమ్మెల్యే శంకరనారాయణకు వినతిపత్రం అందిస్తున్న ఈడిగ కులస్తులు

పెనుకొండ: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణను సోమవారం సోమందేపల్లికి చెందిన పలువురు ఈడిగ కులస్తులు కలిశారు. ఈ సందర్భంగా తమ సమస్యలను విన్నవించారు. సోమందేపల్లి పట్టణంలో కమ్యూనిటీ భవనానికి స్థలం కేటాయించాలని కోరడంతో పాటు ఇతర సమస్యలను ఎమ్మెల్యేకు వివరించగా సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు.

కరాటే క్రీడాకారులకు సర్టిఫికెట్ల పంపిణీ



ప్రమాణ పత్రాలను పంపిణీ చేసిన దృశ్యం

హిందూపురం: పట్టణంలోని ఏఎస్ గోజు ర్యూ కరాటే శిక్షణ సంస్థలో ఉత్తీర్ణత సాధించిన 60 మంది క్రీడాకారులకు సోమవారం సర్టిఫికెట్లను పంపిణీ చేసినట్లు ఇన్‌స్ట్రక్టర్ సెన్‌సీ ఫైరోజ్ తెలిపారు. సోమవారం కేఎస్ఆర్ బ్యాడ్మింటన్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రమాణ పత్రాలను అందించామన్నారు.

ఇద్దరి బైండోవర్

రొళ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం లోకేష్, రాజన్న అనే ఇద్దరిని ఇన్‌చార్జ్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి ఎదుట బైండోవర్ చేసినట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి తెలిపారు. మద్యం అక్రమ రవాణాపై ఇరువురిపై ఇప్పటికే కేసులున్నాయని ముందస్తు చర్యలో భాగంగా వారిని బైండోవర్ చేశామన్నారు. ఆ తర్వాత రూ.లక్ష స్వంత పూచికత్తుపై ఇద్దరిని విడుదల చేసినట్లు వివరించారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

పరిగి: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైనదని వక్తలు తెలిపారు. మండలంలోని శ్రీరంగరాజుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, పీడీ ఆదినారాయణ, ఉపాధ్యాయులు వాణి ప్రభావతి, సరస్వతిని సన్మానించారు. సోమవారం ఆ పాఠశాలలోనే ప్రధానోపాధ్యాయుడు వెంకటేశులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రజుమం జరిగింది.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



విద్యార్థినికి ప్రతిభా పురస్కారం అందచేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: స్థానిక ఎస్ఎస్‌కే సముదాయ భవనంలో కన్నడ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే హెచ్‌వి వెంకటేశ్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. పదో తరగతి కన్నడ భాష పరీక్షలో నూరు శాతం మార్కులు సాధించిన 71 మంది విద్యార్థులకు, పీయూలో 9 మంది టాపర్స్‌కు పురస్కారాలు అందించారు. అలాగే 23 మంది కన్నడ భాష ఉపాధ్యాయులు, 48 మంది ప్రధానోపాధ్యాయులను సన్మానించారు.

వాగ్దానాలను నెరవేర్చే ప్రభుత్వం మాది

ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను తుచా తప్పకుండా తమ ప్రభుత్వం నెరవేరుస్తుందని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గృహ లక్ష్మియోజన పథకాన్ని ఆయన ప్రారంభించారు.

పురంలో వరుస చోరీలు

- బెంబేలెత్తిపోతున్న జనం
- రాత్రి గస్తీ మరచిన పోలీసులు

హిందూపురం అర్బన్: హిందూపురంలో దొంగలు రెచ్చిపోతున్నారు. ఇళ్లకు తాళం పడితే చాలు చోరీలకు దుండగులకు దొంగతనాలకు పాల్పడుతున్నారు. వరుస దొంగతనాలతో పట్టణ వాసులకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. రాత్రి వేళల్లో పోలీసులు గస్తీకి స్వస్తి చెప్పడంతోనే వరుస ఘటనలు జరుగుతున్నాయన్న విమర్శలున్నాయి.

పోలీసు ఇంట్లోనే దొంగతనం

హిందూపురం గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో రవికుమార్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. ఈయన కుటుంబ సభ్యులతో కలిసి పట్టణంలోని టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్నారు. అయితే రవికుమార్ కుటుంబ సభ్యులతో కలిసి ఊరికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఏకంగా రవికుమార్ ఇంటికి కన్నం పెట్టారు. ఇంట్లో ఉన్న 5 తులాల బంగారం, రూ.20 వేల నగదు ఎత్తుకెళ్లారు. పోలీసు ఇంట్లోనే దొంగతనం జరగడం ఆ శాఖలోనే కాదు స్థానికంగా కూడా పెద్ద చర్చనీయాంశమైంది. పోలీసుల ఇంట్లోనే చోరీలు జరిగే సామాన్యుల సంగతేంటని ప్రశ్నిస్తున్నారు.

చోరీలు ఫుల్.. గస్తీ నిల్

ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే హిందూపురం పట్టణానికి ఎంతో ప్రత్యేకత ఉంది. ఇక్కడ జనాభా కూడా ఎక్కువ. సమీపంలోనే ఎక్కువ పరిశ్రమలు ఉండటంతో ఉద్యోగులు, వ్యాపారులు ఎక్కువగా ఇక్కడ నివాసిస్తున్నారు. అయితే ప్రజలకు మేమున్నామన్న భరోసా కల్పించాల్సిన పోలీసులు నిద్రావస్థలో ఉండటంతో జనం ఆందోళన చెందుతున్నారు. పట్టణంలో వరుస చోరీలు జరుగుతున్నా పోలీసులు ఏమాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. రాత్రి వేళ పోలీస్ అధికారులు బయటకు రాకపోవడంతో సిబ్బంది ఆడిందే ఆట .. పాడింది పాటగా మారిందన్న విమర్శలున్నాయి.



టీచర్స్ కాలనీలో కానిస్టేబుల్ రవికుమార్ ఇంటికి కన్నం వేసిన దొంగలు (ఫైల్)



చైతన్యనగర్‌లో 40 తులాల బంగారం చోరీ జరిగిన ఇల్లు ఇదే (ఫైల్)

మట్కా వల్లనే....

హిందూపురం పట్టణంలో జరుగుతున్న దొంగతనాలకు ప్రధాన కారణం పట్టణంలో జోరుగా మట్కా సాగుతుండటమే కారణమంటున్నారు. మట్కాకు అలవాటు పడిన కొందరు తమ అవసరాలకు దొంగతనాలకు పాల్పడుతున్నారని చెబుతున్నారు. కొంతమంది పోలీస్ సిబ్బందికి ఆ విషయం తెలిసినా తెరవెనుక బీటర్లు, నిర్వాహకులు చక్రం తిప్పుతున్నారన్న ఆరోపణలున్నాయి.

నిఘా పెంచుతాం



పట్టణంలో అక్కడక్కడా చోరీలు జరుగుతున్న మాట వాస్తవమే. పోలీసు సిబ్బంది కొరత ఉంది. అయినా ఇప్పటికే రెండు బీట్లు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నాం. ఇప్పటి నుంచి మూడు బీట్లు చేసి వారిని ఎస్ఐ, సీఐలు పర్యవేక్షించే విధంగా చూస్తాం. నేరాల నియంత్రణకు చర్యలు తీసుకొంటాం. ప్రజలు కూడా ఎక్కడికైనా వెళ్లేటప్పుడు సమీప స్టేషన్‌కు సమాచారం ఇస్తే పర్యవేక్షిస్తాం. ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం శ్రేయస్కరం.

\- కంజక్షన్ , డీఎస్పీ

ఈ మధ్య జరిగిన దొంగతనాలిలా...

- పట్టణంలోని చైతన్యనగర్‌లో నివాసం ఉంటున్న ఉపాధ్యాయురాలు లక్ష్మి బెంగళూరుకు వెళ్లారు. ఈ నేపథ్యంలో ఈ నెల 14న ఆ ఇంటిని టార్గెట్ చేసిన దుండగులు 40 తులాల బంగారం, 15 కిలోల వెండి రూ.50 వేల నగదు ఎత్తుకెళ్లారు.
- పట్టణంలోని అజెంతా లాడ్జి సమీపంలో టీ తాగేందుకు ముద్దిరెడ్డిపల్లికి చెందిన ఓ వ్యాపారి ద్విచక్ర వాహనాన్ని ఆపారు. అతని దృష్టి మరల్చి వాహనంలో రూ.5 లక్షలతో ఉడాయించారు. ఈ ఘటన జరిగి మూడు నెలలైనా ఆ మొత్తం రికవరీ కాలేదు.
- మే నెల13న డీఆర్ కాలనీలో ఉపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి ఇంటిలో దొంగలు పడ్డారు. బీరువా పగుల గొట్టి బంగారం, వెండి, నగదు దోచుకెళ్లారు.
- నాలుగు రోజుల క్రితం శ్రీకంఠపురంలో ఓ వృద్ధురాలు ఇంట్లో నిద్రిస్తుండగా మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లారు.
- రెండు నెలల క్రితం మోతుకపల్లిలో ఇద్దరు మహిళల బంగారు గొలుసులను ద్విచక్ర వాహ నాల్లో వచ్చిన దొంగలు లాక్కెళ్లారు.
- పట్టణంలోని ఎన్‌టీఆర్ సర్కిల్ దగ్గర ఓ బ్యాంకులో పనిచేస్తున్న మహిళా ఉద్యోగి సెల్‌ఫోన్‌తో పాటు నగదు లాక్కెళ్లారు.
- మేళాపురం, శాంతి నగర్, టీచర్స్ కాలనీల్లోనూ తరచూ దొంగతనాలు జరుగుతుండటంతో ఆ ప్రాంతవాసులు బెంబేలెత్తిపోతున్నారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

గోరంట్ల: మండల పరిధిలోని పాలసముద్రం, గంగంపల్లి పంచాయతీ పరిధిలోని కొండ్రెడ్డిపల్లిలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రఘునాథ గుప్తా పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు పాలసముద్రం గ్రామం నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు



గాయపడిన అభిషేక్

మడకశిర: పట్టణ సమీపంలోని వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో అభిషేక్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాలమేరకు... అభిషేక్ బెంగళూరు నుంచి చిత్రదుర్గం వైపునకు ద్విచక్ర వాహనం వెళ్తున్నారు. అయితే వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల దగ్గర వాహనం అదుపు తప్పడంతో అభిషేక్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు అతన్ని మడకశిర ప్రభుత్వాస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. బెంగళూరులోని ఓ వాహన షోరూంలో అభిషేక్ పనిచేస్తున్నట్లు తెలిసింది.

అధికారుల ఇంటింటి సర్వే

అమరాపురం: రాబోవు సార్వత్రిక ఎన్నికల కోసం తప్పుడు ఓట్లను ఏరి వేసి పారదర్శకంగా ఓటరు జాబితాను తయారు చేయడానికి అధికారులు మండలంలో ఇంటింటా ఓటరు సర్వేను చేపట్టారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఓటరు జాబితాలో పేర్లు ఉన్న వారు కుటుంబంలో ఉన్నారా? లేదా? అని ఆరా తీస్తున్నారు. 18 సంవత్సరాలు నిండిన వారిని కొత్తగా ఓటరు నమోదుకు దరఖాస్తులను బీఎల్‌ఓలు స్వీకరిస్తున్నారు.

సమస్యలు పరిష్కరించండి

- డివిజన్‌స్థాయి స్పందనలో సబ్‌కలెక్టర్ కార్తీక్

చిలమత్తూరు: మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో సోమవారం పెనుకొండ సబ్‌కలెక్టర్ కార్తీక్ ఆధ్వర్యంలో నిర్వహించిన డివిజన్ స్థాయి స్పందన నిర్వహించారు. 165 మంది అర్జీదారులు వివిధ రకాల సమస్యలను సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొన్ని వినతులు ఇలా...

- ఇప్పటికే వృద్ధాప్య పింఛన్ వస్తోంది. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నానని పింఛన్ మంజూరయ్యేలా చూడాలని లేపాక్షి మండలం తిమ్మగానిపల్లికి చెందిన టి.అంజినప్ప అర్జీ అందజేశారు.
- కోడూరుకు పీహెచ్‌సీ మంజూరైందని, ఇద్దరు డాక్టర్లు కూడా ఉన్నారని అయితే ఆస్పత్రి నిర్వహణకు బిల్డింగ్ లేదని, మంజూరు చేయాలని కోడూరు సర్పంచ్ మురళి వినతి పత్రం అందజేశారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ కార్తీక్

- వీరాపురంలో విదేశీ వలస పక్షులు కోసం చెరువుల వేలం, చింత ఫలసాయం వేలం నిర్వహించడం లేదని, దీని ద్వారా పంచాయితీకి ఆదాయం తగ్గిందని, ప్రత్యేక నిధులు కేటాయించాలని సర్పంచ్ లక్ష్మీపతిరెడ్డి సబ్ కలెక్టర్‌ను కోరారు.
- దేమకేతేపల్లిలో జాతీయ రహదారికి భూములు ఇచ్చిన రైతులలో కొందరికి పరిహారం అందలేదని, వెంటనే పరిహారమిప్పించాలని పలువురు రైతులు విన్నవించారు. కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులతో పాటు తహసీల్దార్ నాగరాజు, ఇన్‌చార్జి ఎంపీడీఓ రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపులో చేతివాటం

- ఇద్దరు ఉద్యోగులతో పాటు మరో వ్యక్తిపై కేసు నమోదు

మడకశిరరూరల్: దేవునికే శఠగోపం పెడదామనుకున్న ఇద్దరు ఉద్యోగులతో పాటు మరో వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని జిల్లెడగుంట ఆంజనేయస్వామి దేవాలయంలో సోమవారం హుండీ లెక్కింపు జరిగింది. ఈ నేపథ్యంలోనే దేవాదాయశాఖలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ గోపాల్‌కృష్ణ, అటెండర్ సురేష్, మరో వ్యక్తి లక్ష్మీనరసప్ప కలసి రూ.18,850 హుండీ డబ్బును దొంగిలించేందుకు ప్రయత్నించారు. వారు డబ్బుల కట్టలను దాచిపెట్టుకోవడం పోలీసులు గమనించారు. వెంటనే వారిని తనిఖీ చేయగా డబ్బు దొంగిలించినట్లు తేలింది. అంతకు ముందే వారు ప్లాన్ ప్రకారం ఆలయంలో ఉన్న సీసీ కెమెరాల్లో రెండింటిని ఆఫ్ చేసినట్లు కూడా అధికారులు గుర్తించారు. నగదు దొంగిలించిన వారి నుంచి నగదు రికవరీ చేశామని ఈఓ నాగేంద్రప్రసాద్ తెలిపారు. మరోవైపు ఈఓ ఫిర్యాదు మేరకు దేవదాయశాఖలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ గోపాల్ కృష్ణ, అటెండర్ సురేష్, మరో వ్యక్తి లక్ష్మీనరసప్పపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఇషాక్‌బాషా తెలిపారు.



ఆంజనేయస్వామి ఆలయంలో హుండీ లెక్కిస్తున్న దృశ్యం

7.28,933 లక్షల ఆదాయం

జిల్లెడుగుంట ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు స్వామి వారికి హుండీలకు సోమవారం లెక్కించారు. హుండీ కానుకల ద్వారా రూ.7,28,933 ఆదాయం వచ్చిందని దేవదాయశాఖ అధికారులు తెలిపారు.

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి

హిందూపురం: మణిపూర్‌లో జరుగుతున్న మారణహోమాన్ని ఆపి శాంతి నెలకొల్పేవిధంగా చర్యలు చేపట్టాలంటూ వివిధ ప్రజా సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇందులో భాగంగానే సోమవారం హిందూపురంలోని క్రైస్తవ , ప్రజా సంఘాలు, ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్‌ల ఆధ్వర్యంలో పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం చేరుకుని నిరసన తెలిపి తహసీల్దార్ హసీనా సుల్తానాకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు నాగేంద్రకుమార్, ఉదయ్‌కుమార్, స్టీఫెన్ రాజ్, ఆనంద్ రాజ్, విక్టర్ జాషువా, శ్రీరాములు, సునీల్, డేవిడ్, సూర్యప్రకాష్, దేవరాజ్, కౌన్సిలర్ మల్లికార్జున, ఉమర్‌ఫారూక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మున్సిపల్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ, బీఎస్పీ ఆధ్వర్యంలో నాయకులు పట్టణంలో ర్యాలీ చేపట్టి అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు.



మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలని ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పెనుకొండ: మణిపూర్‌లో రాష్ట్రపతి పాలని విధించాలని మానవ హక్కుల సంఘం నాయకులు రవూఫ్, సమీవుల్లా, సిరాజుద్దీన్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి రామాంజినేయులు, వెంకటేసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తహసీల్దార్ స్వర్ణలతకు సోమవారం వినతిపత్రం అందించారు.

'జగనన్న సురక్ష' పేదలకు వరం

- హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక

హిందూపురం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త అధ్యాయాన్ని లిఖించారని హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక అన్నారు. సోమవారం సంతేబిదనూరులో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వమూ జగనన్న సురక్ష లాంటి కార్యక్రమం చేయలేదన్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు పొందని వారికి జగనన్న సురక్ష ఓ వరం లాంటిదని స్పష్టం చేశారు. అనంతరం సర్పంచ్ లలితతో కలసి అర్హులైన వారికి ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేంద్రబాబు, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, స్పెషల్ ఆఫీసర్ చంద్రమౌళిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘని, నాయకులు కొటిపి హనుమంతరెడ్డి, జనార్దన్‌రెడ్డి, దేవరాజు, శ్రీనివాసరెడ్డి, ఆనంద్, శ్రీకాంత్‌గౌడ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న దీపిక

'జగనన్న సురక్ష ' నేడు ఇలా..

రొళ్ల: మండల పరిధిలోని హులికుంట సచివాలయ ఆవరణలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆజాద్, ఈఓఆర్డీ క్రిష్ణప్ప తెలిపారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి కార్యక్రమానికి హాజరై లబ్ధిదారులకు ఉచితంగా సర్టిఫికెట్లను అందజేస్తారన్నారు.

లేపాక్షి: మండలంలోని కొండూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 9 గంటలకు జగనన్న సురక్షా కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ నరసింహానాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

పరిగి: మండలంలోని శ్రీరంగరాజుపల్లి గ్రామ సచివాలయంలో మంగళవారం 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సరస్వతి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహించే కార్యక్రమంలో గ్రామ సచివాలయ పరిధిలోని శ్రీరంగరాజుపల్లి, ముల్లమోతుకపల్లి, పాపిరెడ్డిపల్లిలోని లబ్ధిదారులకు వివిధ సర్టిఫికేట్లను అందిస్తామన్నారు.

అమరాపురం: మండలంలోని తమ్మడేపల్లి గ్రామ సచివాలయంలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మునిస్వామి తెలిపారు.

కరుణించు వరుణ దేవా...



కుంభాభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యే తిప్పేస్వామి



కోనేరు దగ్గర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలోని చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో సోమవారం వరుణుడి కటాక్షం కోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కుంభాభిషేకం నిర్వహించారు. ఉదయం 6 గంటలకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గణపతి పూజ, నవగ్రహ పూజ, రుద్రాభిషేకం, మహా కుంభాభిషేకం, శత కుంభాభిషేకం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. 101 కడవల నీటితో స్వామి వారికి పూజలు జరిపారు. వరుణ హోమం, వరుణ జపం తదితర ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి, మాజీ మంత్రి రఘువీరారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, పట్టణ ప్రముఖులు కుంభాభిషేకంలో పాల్గొన్నారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పావగడ: పట్టణంలోని బాపూజీ ఉన్నత పాఠశాల 1988–89 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. పాఠశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన సమ్మేళనం హుషారుగా సాగింది. ఎన్నో ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో పలకరింతలు, ఆలింగనాలు, చిరు నవ్వుల చిద్విలాసాలతో కబుర్లు చెప్పుకుంటూ పాత జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి ఉపాధ్యాయులు నివృత్త హెచ్‌ఎం మహబూబ్ బాషా తదితరులను ఘనంగా సన్మానించారు.

ప్రభుత్వ స్థలంలో గుడిసెలు

పెనుకొండ: పట్టణంలోని 668 సర్వే నంబర్ మడకశిర రోడ్డులో కోట్ల రూపాయల విలువజేసే ప్రభుత్వ స్థలంలో పేదలు సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం గుడిసెలు వేసుకున్నారు. రూ. కోట్ల విలువైన భూమి కబ్జా కాకుండా స్వయంగా సబ్‌కలెక్టర్ సర్వే చేయించి నిషిద్ధ బోర్డులు నాటాలని జారీ చేసినా అధికారులు ఎవరూ పట్టించుకోలేదు. ఆ స్థలంలో పెద్ద ఎత్తున పేదలు గుడిసెలు వేసుకోవడంతో తహసీల్దార్ స్వర్ణలత ఆ ప్రాంతానికి చేరుకొని సీపీఎం నాయకులు పెద్దన్న, గంగాధర్ తదితరులకు నచ్చజెప్పడానికి ప్రయత్నించినా వారు వినలేదు. ఆఖరికి భూమిని సర్వేచేసి పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వడానికి తగిన చర్యలు చేపట్టాలని సర్వేయర్ కోదండపాణికి తహసీల్దార్ సూచించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

హిందూపురం: రూరల్ మండల పరిధిలోని నక్కలపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు హనుమంతరెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక నక్కలపల్లికి చేరుకొని హనుమంతరెడ్డి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నక్కలగుట్ట స్థలాన్ని కాపాడండి

పెనుకొండ: సోమందేపల్లి మండల కేంద్రంలోని నక్కలగుట్ట స్థలాన్ని కాపాడాలని పలువురు స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. విలువైన స్థలాన్ని ఇష్టారాజ్యంగా ఆక్రమించుకుంటున్నారని నిరసన తెలపారు. ఈ నేపథ్యంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెసుకున్న సబ్‌కలెక్టర్ కార్తీక్ సంఘటనా స్థలానికి చేరుకుని ధర్నా చేస్తున్న వారితో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు నిరసన విరమించారు. దళిత నాయకుడు నరసింహమూర్తి, నాగినాయని చెరువు సర్పంచ్ అంజేనాయక్ తదితరులు పాల్గొన్నారు.



మడకశిరలో వర్షం కురుస్తున్న దృశ్యం

మోస్తరు వర్షం

మడకశిరరూరల్/పెనుకొండరూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మడకశిర, హిందూపురం, పెనుకొండ నియోజకవర్గాల్లో సోమవారం మోస్తరుగా వర్షం పడింది. గత మూడు రోజుల నుంచి జల్లుల వర్షం పడుతుండంతో ఖరీఫ్ వేరుశనగ పంట సాగు చేయని రైతులు వేరుశనగ విత్తనాలు విత్తుకుంటున్నారు. ఈనెల ఆఖరి వరకు వేరుశనగ విత్తనాలు విత్తుకోవచ్చునని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. పెనుకొండ మండలంలో 3.0 మి.మీటర్లుగా వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

పండ్ల మొక్కల పెంపకానికి ప్రాధాన్యం

మడకశిరరూరల్: ఉపాధి హామీ పథకం ద్వారా వివిధ రకాల పండ్ల మొక్కల పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఏపీఓ శ్రీకాంత్‌గౌడు తెలిపారు. ఆయన సోమవారం జీబీపాళ్యం పంచాయతీలో పండ్ల మొక్కల పెంపకాన్ని పరిశీలించి పలువురు రైతులకు పలు సూచనలు సలహాలను అందించారు. ఆయన మాట్లాడుతూ పండ్లు మొక్కల పెంపకంతోనే ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చన్నారు. 190 ఎకరాల్లో 90 మంది రైతుల పొలాల్లో మొక్కల పెంపకం చేపట్టామన్నారు.